పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా: జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

# తిరుచెందూరుకు ఉత్సవ శోభ

● భారీ ఏర్పాట్ల నడుమ నేడు మహాకుంభాభిషేకం



చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో భారీ ఏర్పాట్ల నడుమ సోమవారం ఉదయం మహాకుంభాభిషేక ం నిర్వహించనున్నారు. ఈ కుంభాభిషేకం పూజాకార్యక్రమాలను తొలిసారిగా తమిళంలోనూ, సంస్కృతంలో నిర్వహించనుండటం విశేషం. ఈ కుంభాభిషేక వేడుకలు తిలకించేందుకు దేశవిదేశాల నుండి తరలివచ్చిన భక్తులతో తిరుచెందూరు క్షేత్రం జనసముద్రంగా మారింది. ఈ వేడుకలను పురస్కరించుకుని మూలవర్లు, పార్వతీదేవి, కరియమాణిక్య వినాయకస్వామి, వళ్ళి, దైవానై తదితర దేవతామూర్తులకు ఆలయ అంతర ప్రాకారంలో యాగశాల వద్ద పూజలు చేస్తున్నారు. రాజగోపురం దిగువన నిర్మించిన యాగశాలలో ఈ నెల 1 నుంచి యాగ పూజలు ప్రారంభమయ్యాయి. గత రెండు రోజులుగా శైవపండితులు స్వర్ణ తాపడంచేసిన స్వామివారిమూలవిరాట్టు, షణ్ముఖస్వామి, వళ్ళి, దైవానై సహా అన్ని విమాన గోపురాల కలశాలను విమానంపై తీసుకెళ్ళి, వాటిలో రాగులను నింపి మళ్ళీ ఆయా విమానాలపై కలశాలను ప్రతిష్ఠించారు. శనివారం ఉదయం 8వ కాలపు యాగశాల పూజ, రాత్రి తొమ్మిదో కాలపు యాగశాల పూజ, మహాదీపారాధన జరిగాయి. సాయత్రం స్వామివారికి తొలి యాగశాల పూజ జరిపారు. షణ్ముఖుడు, పరివార మూర్తులకు ఆదివారం ఉదయం 10వ కాల యాగశాల పూజలు జరిగాయి. మధ్యాహ్నం నుండి ఆలయంలో భక్తుల దర్శనాలు రద్దు చేశారు. సాయంత్రం ఏకాదశ కాలపూజ జరిగింది. సోమవారం వేకువజాము ద్వాదశ కాల పూజలు పూర్తయిన తరువాత ఉదయం 6.15 నుంచి రాజగోపుర కలశాలలకు మహాకుంభాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఆ సమయంలోనే మూలవర్లు, షణ్ముగస్వామి, వళ్ళి, దైవానై, పెరుమాళ్, నటరాజస్వామి సహా అన్ని పరివార మూర్తి స్వాములకు కూడా కుంభాభిషేకం జరుగుతుంది. భక్తులు ఈ కుంభాభిషేక వేడుకలను ఎలాంటి ఇబ్బంది లేకుండా తిలకించేలా సముద్రతీరం పొడవునా కంచెలు, బారికేడ్లు నిర్మించారు. విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. అదే విధంగా భక్తులు కుంభాభిషేక వేడుకలు తిలకించేలా ఎల్ఈడీ స్క్రీన్‌లపై ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న రుత్విక్కులు

### 20 డ్రోన్ల ద్వారా పవిత్రజలాలు...

ఈ వేడుకలను తిలకించడానికి లక్షలాదిమంది భక్తులు రానుండడంతో కుంభాభిషేకం జరుగుతున్నప్పుడు పవిత్ర జలాలను వారిపై చల్లేందుకు 20 డ్రోన్లను ఉపయోగించనున్నారు. ఈ డ్రోన్ల పనితీరును ఎస్పీ ఆల్బర్ట్‌జాన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వేడుకలకు 6 వేలమంది పోలీసులతో భద్రత కల్పిస్తున్నారు. వివి.ధ ప్రాంతాల నుండి వేల సంఖ్యలో బస్సులను తిరుచెందూరుకు నడుపనుండటంతో మూడు తాత్కాలిక బస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు.



డ్రోన్ల పనితీరు పరిశీలిస్తున్న ఎస్పీ

## నా ప్రచార యాత్రతో
# డీఎంకే పతనం ఖాయం

● ఈపీఎస్ ధీమా

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' (ప్రజలను కాపాడుదాం-రాష్ట్రాన్ని విడిపిద్దాం)అనే నినాదంతో రాష్ట్రంలో సోమవారం నుంచి ప్రారంభించనున్న ప్రచార యాత్రతో డీఎంకే పతనం ఖాయమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రజల వద్దకు వెళ్ళి ప్రచారం చేసేందకు ఈపీఎస్ నిర్ణయించారు. ఆ మేరకు సోమవారం తన ప్రచార యాత్రను కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం నుంచి ప్రారంభించనున్నారు. తన ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్ర ప్రజల మద్దతు కోరుతూ ఈసీఎస్ ఆదివారం మీడియా ద్వారా ఓ లేఖ విడుదల చేశారు. అందులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీ బీజేపీ, మరికొన్ని ప్రాంతీయ పార్టీలతో కలిసి పోటీ చేయనున్నట్లు తెలిపారు. తమ కూటమిని ఆదరించి మెజారిటీ స్థానాలను గెలిపించాలని, అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేలా కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మీ వద్దకే వస్తున్న తనను కుటుంబ సభ్యుడిగా భావించి ఆశీర్వదించాలని, మీరెదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకుంటానని ఈపీఎస్ తన లేఖలో సూచించారు. డీఎంకే ప్రభుత్వం విద్యార్థుల విద్యను కూడా రాజకీయం చేసిందని, రాష్ట్రం సశ్యశ్యామలంగా ఉండాలన్న సంకల్పంతో చేపడుతున్న తన ప్రచార పయనంతో డీఎంకే పతనం ఖాయమని ఈపీఎస్ ధీమా వ్యక్తంచేశారు.



ఈపీఎస్‌కు శూలాయుధాన్ని బహూకరిస్తున్న మాజీమంత్రి మాధవరం మూర్తి తదితరులు

### పర్యటన సాగేదిలా...

ఈ నెల 23వ తేదీ వరకు కోవై జిల్లాలో ఈ పర్యటన ఉంటుంది. ఆ తర్వాత కడలూరు, విల్లుపురం, అరియలూరు, తంజావూరు, తిరువారూర్, నాగపట్నం తదితర డెల్టా జిల్లాలు, ఉత్తర జిల్లాల్లో ఆయన పర్యటన కోసం అన్నాడీఎంకే నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 10,11 తేదీల్లో విల్లుపురం జిల్లాలో నియోజకవర్గాలు, 12వ తేదీ కడలూరు జిల్లా, 15వ తేదీ పెరంబలూరు జిల్లా, 16న కడలూరు పశ్చిమ జిల్లా, 17న మైలాడుదురై జిల్లా, 18న తిరువారూర్, నాగపట్నం జిల్లా లు, 19న వేదారణ్యం, 21న తిరువారూర్, 22,23వ తేదీల్లో తంజావూరు జిల్లాలోని నియోజకవర్గాల్లో ఈపీఎస్ పర్యటిస్తారని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

# అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సన్నాహాలు

● ఆగస్టు 17న తొలి మహానాడు

చెన్నై, చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు బీజేపీ సన్నద్ధమవుతోంది. ఓ వైపు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఇంటింటా ప్రచారం చేయడానికి పార్టీ శ్రేణులను సిద్ధం చేయడం, మరో వైపు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి సోమవారం నుండి తన ప్రచార యాత్ర ప్రారంభించనున్న నేపథ్యంలో బీజేపీ బూత్ కమిటీల సమావేశాన్ని కాట్టాన్‌కుళత్తూర్‌లో ఆదివారం ఉదయం నిర్వహించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అరవింద్ మేనన్, కో-ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, చెంగల్పట్టు శాఖ అధ్యక్షుడు రఘురామన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీని అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేసే దిశగాను, పార్టీశ్రేణులను ఉత్సాహపరిచేవిధంగా, తిరునల్వేలిలో బీజేపీ తొలి మహానాడును ఆగస్టు 17న నిర్వహించాలని నిర్ణయించారు.

### అన్నాడీఎంకేకు భారం కాదు బలం

అన్నాడీఎంకేతో బీజేపీ కుదుర్చుకున్న పొత్తు ఆ పార్టీకి భారంగా ఉండకూడదని, పార్టీకి కొత్త బలాన్నిచ్చే విధంగా ఉండేలా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పనిచేయాలని పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నాయకత్వంలో తమిళగ వెట్రి కళగం, సీమాన్ నాయకత్వంలోని నామ్ తమిళర్ కట్చి నుండి గట్టి పోటీ ఎదురవుతుందని, ఆ పోటీని తట్టుకుని అన్నాడీఎంకే, బీజేపీ శ్రేణులంతా ప్రచారం చేయాలని, కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వ పాలనలో క్షీణించిన శాంతి భద్రతలు, విపరీతంగా పెరిగిన అవినీతి అక్రమాలను గురించి కూడా ప్రచారం చేయాలని, అవసరమయితే కరపత్రాలను ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేయాలని కూడా పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ప్రజలకు వివరించాల్సిన అవసరం కూడా ఉందన్నారు.



జ్యోతి ప్రజల్వన చేస్తున్న నయినార్ నాగేంద్రన్

### 7 చోట్ల మండల మహానాడు...

పార్టీని బలోపేతం చేసే దిశగా ఏడు చోట్ల మండల మహానాడు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఆ మేరకు తొలి మండల మహానాడు తిరునల్వేలిలో ఆగస్టు 17న నిర్వహించనున్నారు. ఆ తర్వాత సెప్టెంబర్ 13న మదురైలో అక్టోబర్ 26 కోయంబత్తూరులో, నవంబరు 23న సేలంలో, డిసెంబర్ 21న తంజావూరులో మండల మహానాడు జరుపనున్నారు. అదే విధంగా వచ్చే యేడాది జనవరి 4న తిరువణ్ణామలైలో జనవరి 24న తిరువళ్లూరులోను మండల మహానాడు నిర్వహించనున్నట్లు బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటించారు.



సమావేశానికి హాజరైన పార్టీ నేతలు, బూత్‌కమిటీ నాయకులు

# 2న 'భక్తి-ముక్తి' అంశంపై చాగంటి ప్రవచనం

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక భారతీయతా వాహిని ఆధ్వర్యంలో ఆగస్టు 2, 3 తేదీల్లో 'భక్తి-ముక్తి' అనే అంశంపై ప్రవచన సార్వభౌమ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం చేయనున్నారని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. చెట్‌పట్‌లోని కుచలాంబాళ్ కల్యాణమహల్‌లో సాయంత్రం 6.15 గంటలకు ఈ ప్రవచన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.




చాగంటి కోటేశ్వరరావు

## పీఎంకే వర్కింగ్ కమిటీ నుంచి
# అన్బుమణి తొలగింపు



● పార్టీలో ఇక నా మాటే శాసనం ● రాందాస్ సంచలనాత్మక నిర్ణయం

అడయార్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తనయుడిపై కఠిన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యత్వం నుంచి ఆయన కుమారుడు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ అన్బుమణిని తొలగించారు. దాంతో పాటు 21 మంది సభ్యులతో వర్కింగ్ కమిటీని చకచకా ఏర్పాటుచేశారు. ఆ కమిటీలో అన్బుమణి మద్దతుదారుల్లో ఏ ఒక్కరికీ కూడా స్థానం కల్పించలేదు. గత కొన్ని నెలలుగా ఇద్దరి మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం దిండివనం తైలాపురంలో ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం రాందాస్ అధ్యక్షతన జరిగింది. అందులో పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి, సీనియర్ నేతలు వడివేలు రావణన్, తిలకబామా, అరుల్‌మొళి, ప్రొఫెసర్ ధీరన్, మాజీ ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎంపీ ఏకే మూర్తి, అరంగవేలు, సెంథిల్, ఆర్ముగం, పసుమై తాయగం ప్రకాశం, న్యాయవాది బాలు, కవి జయభాస్కరన్‌తో సహా మొత్తం 19 మంది పాల్గొన్నారు. సమావేశంలో రాందాస్ మాట్లాడుతూ, తన మార్గనిర్దేశకత్వంలో పార్టీ ముందుకు సాగుతుందని, తాను చెప్పినట్టుగానే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోపార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు. అదేసమయంలో పార్టీ వర్కింగ్ కమిటీని రద్దు చేసి, కొత్తగా 21 మంది సభ్యులతో కూడిన కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పాత కమిటీలో సభ్యుడైన తన కుమారుడు అన్బుమణిని తొలగించారు. అన్బుమణి రాందాస్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఆ పార్టీ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి.



పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్

## నల్లతంగాళ్‌లో విగ్రహప్రతిష్ఠకు
# అనుమతివ్వండి


టి.నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపం అర్జునాపురం నల్లతంగాళ్ ఆలయంలో ఆరునెలల క్రితం దుండగులు ధ్వంసం చేసిన మూలవిరాట్టుకు బదులుగా తాము రూపొందించిన విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అనుమతించాలని కోరుతూ గ్రామస్థులు ధర్నాకు దిగారు. నల్లతంగాళ్ తమిళ మహిళల సంస్కృతికి, అన్నా చెల్లెళ్ల ఆత్మీయ బంధానికి ప్రతీకగా ఉంటోంది. నల్లతంగాళ్ జీవించిన 15వ శతాబ్దంలో తీవ్ర కరవు పరిస్థితుల కారణంగా తన ఏడుగురు పిల్లలను బావిలోకి తోసి తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్య చేసుకున్న బావి, ఆమె ఉన్న చోటు స్మారక చిహ్నాలుగా మారాయి. అక్కడ ఆలయం కూడా వెలసింది. ఆ ఆలయంలో నల్లతంగాళ్ భద్రకాళి రూపంలో భక్తులను అనుగ్రహిస్తోంది. ఈ ఆలయంలో జనవరి 26న గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నల్లతంగాళ్ విగ్రహాన్ని పగులగొట్టారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. గత ఆరుమాసాలుగా నల్లతంగాళ్ విగ్రహం లేక ఈ ఆలయం కళావిహీనంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త విగ్రహాన్ని తయారు చేయించి, ఆలయంలో తామే దానిని ప్రతిష్ఠించి కుంభాభిషేకం జరుపుకుంటామని గ్రామస్థులు దేవాదాయ శాఖకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. దేవాదాయ శాఖ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ముత్తాలమ్మన్ బజారు ప్రాంతంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో అర్చునాపురం గ్రామస్థులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే రామసామి సహా 300 మందికిపై గ్రామస్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామస్థులు

## రాష్ట్రంలో బీజేపీ బలం పుంజుకునే
# అవకాశం లేదు!

● అన్నాడీఎంకే నేత అన్వర్ రాజా



టి.నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎప్పటికీ బీజేపీ బలం పుంజుకునే అవకాశం లేదని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని అన్నాడీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి అన్వర్‌రాజా పేర్కొన్నారు. బలమైన కూటమి ఏర్పాటు చేస్తానని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి చెబుతున్నప్పటికీ అన్నాడీఎంకే - బీజేపి మధ్య ఏర్పడినది పొంతలేని కూటమి అని ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నారు. వీటన్నింటికి తోడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందని బీజేపీ నాయకులు చెబుతుండటంపై అన్నాడీఎంకే నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ అంశాలపై అన్వర్ రాజా మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో ఎన్నటికీ పొత్తు పెట్టుకోబోమని ప్రకటించి ఆ పార్టీతోనే పొత్తుకుదుర్చుకోవటం సమంజసమేనా అని అడుగుతున్నారని, పొత్తు అనేది ఎన్నికల సందర్భంగా కుదుర్చుకునే తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని గుర్తించాలన్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వేర్వేరు సిద్ధాంతాలు కలిగిన పార్టీలు పొత్తు పెట్టుకోవడం తప్పుకాదన్నారు. దేశంలో బీజేపీతో ఎన్నో పార్టీలు పొత్తు కుదుర్చుకుంటున్నాయని, ఆ రీతిలోనే అన్నాడీఎంకే కూడా బీజేపీతో ఎన్నికల పొత్తు కుదుర్చుకుందని చెప్పారు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటే అన్నాడీఎంకేకు ఓట్లు తగ్గటం వాస్తవమేనని, అదే సమయంలో పార్టీకంటూ ప్రత్యేకంగా మైనారిటీల ఓటు బ్యాంకు కూడా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకునేందుకు బదులుగా విజయ్ నాయకత్వంలోనే తమిళగ వెట్రి కళగంతో పొత్తు కుదుర్చుకోవచ్చు కదా అంటూ పార్టీలో కొందరు ప్రతిపాదిస్తున్నారని, అయితే ఈ విషయంగా నిర్ణయం తీసుకోవాల్సింది విజయ్ మాత్రమేనని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నప్పుడు డీఎంకే కూటమిలో చీలికలు ఏర్పడతాయని, మిత్రపక్షాలు కూటమి నుంచి వైదొలగుతాయని అన్వర్‌రాజా జోస్యం చెప్పారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం

● రక్తం చిందించి భక్తిని చాటుకున్న షియా ముస్లింలు




ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం మత పరిరక్షణ కోసం కర్బలా మైదానంలో పోరాడుతూ వీరమరణం పొందిన హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్‌ల సహా 72 మంది బంధువులను స్మరిస్తూ గత నెల 26 నుంచి రాష్ట్రంలో షియా ముస్లింలు మొహర్రం సంతాప దినాలను పాటించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చావళ్లలో పీర్లను ఏర్పాటు చేసి 9 రోజులు మాతం, మజ్లీస్, సాంబ్రాణితో ధూపం, ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా పదో రోజైన ఆదివారం మొహర్రం సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు లో మతసామరస్యాన్ని చాటేలా హిందూ ముస్లింలు పాల్గొన్నారు. కొత్త సంవత్సరం ప్రారంభాన్ని సూచించే మొహర్రం మాసంలో 10 రోజులు పాటు షియా ముస్లింలు రాష్ట్రవ్యాప్తంగా విశ్వశాంతి కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేకించి మొహర్రం మాసంలో కర్బాలో మహమ్మద్ ప్రవక్త మనవళ్ల ఇమామ్ హుస్సేన్, ఇమామ్ హసన్‌ల త్యాగాలు స్మరించుకుంటూ పది రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం రాత్రి ప్రత్యేక చావళ్లలో కొలువుదీర్చిన పీర్లు ఎత్తుకొని డప్పులతో ధూలా ఆడారు. మతాలకతీతంగా హిందూ, ముస్లింలు కలసి రాజధాని నగరం చెన్నైలో పులియాంతోపు, రాయపేట, ఐస్ హౌస్, రాయపురం, పటాలం, చూలై, థౌజండ్ లైట్స్, జాం బజార్, మైలాపూర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న షియా ముస్లింలు పలు ప్రాంతాల్లో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. తమ శరీరాలు గాయపరచుకొని రక్తం చిందిస్తూ భక్తిని చాటుకున్నారు.



రక్తం చిందిస్తున్న షియాలు





ఊరేగింపులో చిన్నారులు

# పయనూరు వద్ద రవాణా మంత్రి ఆకస్మిక తనిఖీ

●బస్ కండెక్టర్, డ్రైవర్‌లకు మందలింపు

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పయనూరులో ఓ రెస్టారెంట్ వద్ద నిలిపిన రాష్ట్ర రవాణా సంస్థ బస్సును రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఆకస్మిక తనిఖీ జరిపారు. ప్రయాణికుల భోజనం కోసం ప్రభుత్వం నిర్దేశించిన రెస్టారెంట్ వద్ద కాకుండా తమకు నచ్చిన రెస్టారెంట్ వద్ద ఆపిన కండెక్టర్, డ్రైవర్‌లను ఆయన సున్నితంగా మందలించారు. కోవైలో శనివారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, రాత్రి కారులో అరియలూరు వైపు బయలుదేరారు. ఆ సమయంలో కరూరు - పయనూరు మధ్య ఓ రెస్టారెంట్ వద్ద కారు ఆపి టీ తాగారు. ఆ రెస్టారెంట్ వద్ద రాష్ట్ర రవాణా సంస్థ బస్సు కూడా ఆగి ఉండడం గమనించారు. బస్ డ్రైవర్, కండెక్టర్ ఆ రెస్టారెంట్‌లో భోజనం చేసి బయటకు వస్తుండగా రవాణాశాఖ మంత్రి శివశంకర్ వారిద్దగరకు వెళ్ళి మాటలు కలిపారు. ఆ సమయంలో ప్యాంట్, షర్టు వేసుకుని ఉండటంతో వారు మంత్రిని గుర్తించలేకపోయారు. ప్రయాణికులు, కండెక్టర్, డ్రైవర్లు భోజనం చేయడానికి ప్రభుత్వం నిర్దేశించిన రెస్టారెంట్లు, హోటళ్ల వద్ద బస్సు ఆపకుండా ఈ రెస్టారెంట్ వద్ద ఎందుకు ఆపారంటూ ప్రశ్నించారు. 'ఇవన్నీ మీరెందుకు పట్టించుకుంటారు.. సార్ . మీ పనేదో చూసుకుని వెళ్లండి' అంటూ వారు బదులిచ్చారు. వెంటనే మంత్రి నవ్వుతూ నేనెవరో మీకు తెలుసా? అని ప్రశ్నించగా, తెలియదని చెప్పగా 'నేనేనయ్యా మీ రవాణా శాఖ మంత్రిని' అని శివశంకర్ అనగానే ఇరువురూ దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఆయన వారి భుజాలను తట్టి ఇకపై ఇలాంటి తప్పులు చేయకండి. ప్రభుత్వం నిర్దేశించిన హోటళ్లు, రెస్టారెంట్ల వద్ద బస్సు ఆపి ప్రయాణికులతో కలిసి భోజనం చేయండని తెలిపారు. కండెక్టర్, డ్రైవర్ మంత్రికి క్షమాపణ చెప్పుకుని, ఇకపై ప్రభుత్వం నిర్దేశించిన హోటళ్లు, రెస్టారెంట్ల వద్దే బస్సు ఆపుతామని చెప్పి అక్కడి నుండి బయలుదేరారు.



కండెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి శివశంకర్

## యూట్యూబర్‌పై అదనపు కట్నం కేసు

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను చిత్రహింసలు పెట్టారనే ఆరోపణలపై ప్రముఖ యూట్యూబర్ సుదర్శన్, అతడి తల్లిదండ్రులు, సోదరి సహా ఐదుగురిపై తేని మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరపాండి కేఎంసీ ముల్లై నగర్‌కు చెందిన డాక్టర్ విమలాదేవి (27), సుదర్శన్ (32)ను ప్రేమించి 2024లో పెళ్ళి చేసుకుంది. ఆ సందర్భంగా విమలాదేవి తల్లిదండ్రులు వరకట్నంగా 30 సవర్ల నగలు, రూ.5 లక్షల నగదు, రూ.2లక్షల విలువైన సారె అందజేశారు. ప్రస్తుతం ఈ దంపతులకు ఓ కుమారుడు కూడా ఉన్నాడు. ఈ నేపథ్యంలో పుట్టింటి నుండి అదనపు కట్నంగా రూ.5లక్షల నగదు, రూ.20 సవర్ల బంగారు నగలు తీసుకురమ్మంటూ అత్తమామలు సుందరరాజన్, మాలతి, ఆడపడుచు శక్తిప్రియ, ఆడపడుచు భర్త విగ్నేశ్వరన్ చిత్రహింసలకు గురిచేసినట్లు విమలాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు యూట్యూబర్ సుదర్శన్ సహా ఐదుగురిపి తేని మహిళా పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.



సుదర్శన్

## రైలు కింద పడి దంపతుల ఆత్మహత్య

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి మోటారు వాహన అధికారి, ఆయన భార్య నామక్కల్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదానికి దారితీసింది. నామక్కల్ మోగనూరు రోడ్డు కలైవాణి నగర్‌కు చెందిన సుబ్రమణియన్ (55) తిరుచ్చిలో ఆర్టీవోగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య ప్రమీల (51), సంయుక్త అనే కుమార్తె, ఆదిత్యన్ అనే కుమారుడు ఉన్నారు. భార్య ప్రమీల మోగనూరు సమీపం ఆండాపురం పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయరాలిగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామున నామక్కల్ సమీపం వగురంపటి ప్రాంతంలోని నామక్కల్-కరూర్ రైలు మార్గంలో సుబ్రమణియన్, ప్రమీల శరీరాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. సమాచారం అందుకున్న సేలం రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దంపతుల ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



సుబ్రమణియన్, ప్రమీల (ఫైల్‌ఫొటో)

## లైంగిక వేధింపుల కేసులో సిద్ధ వైద్యుడికి 20 ఏళ్ల జైలు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సిద్ధ వైద్యుడికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. రాయపురం ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలిక 2022లో హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో, తల్లిదండ్రులు రాయపురంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు, ఆమెపై ఎవరో లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించగా, కొడుంగైయూర్‌లో సిద్ధ క్లినిక్ నడుపుతున్న బాలసుబ్రమణి (60), తనను క్లినిక్‌కు తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు తెలిపింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎంకేబీ నగర్ పోలీసులు విచారణ చేపట్టి పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి బాలసుబ్రమణిని అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో, నిందితుడు బాలసుబ్రమణికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ చెన్నై పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎస్.పద్మ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బాధిత బాలికకు రూ.2 లక్షలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి సిఫారసు చేశారు.

## ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తనిఖీలు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. మాంసాహార వంటలకు వినియోగిస్తున్న నూనె నాసికరంగా ఉందనే ఫిర్యాదుల నేపథ్యంలో, అధికారులు తనిఖీలు చేపట్టారు. ఒక రోజు వాడిన నూనె మరుసటిరోజు వినియోగించరాదని, ప్రతిరోజు నాణ్యమైన నూనె వినియోగించాలని అధికారులు దుకాణ యజమానులకు సూచించారు. అలాగే, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్, మటన్ వినియోగించరాదని అధికారులు ఆదేశించారు.



నూనెను పరిశీలిస్తున్న ఆహార భద్రతాధికారి భాను సుజాత

## తమిళనాడు సైన్స్ ఇయక్కం వార్షిక సమావేశం

వేలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సైన్స్ ఇయక్కం, వేలూరు శాఖ వార్షిక సమావేశం చెల్లియప్ప భవనంలో జరిగింది. కార్యక్రమంలో ఇయక్కం జిల్లా అధ్యక్షుడు దేవి అధ్యక్షత వహించగా, శాఖ సెక్రెటరీ సిలువన్ ఆహ్వానం పలికారు. జిల్లా సెక్రటరీ జనార్దనన్ సమావేశం ప్రారంభించగా, కోశాధికారి శేఖర్, జిల్లా కార్యకర్తల కమిటీ సభ్యులుల రాజేంద్రన్, సుకుమార్, ఇళవయగన్ సహా పలువురు పాల్గొన్నారు. సమావేశంలో, జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సైన్స్ శిక్షణా శిబిరాలు, జిల్లా స్థాయిసైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహణ, 2024,2025వ సంవత్సరం పది, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, బహుమతులు అందించడం సహా పలు కార్యక్రమాలపై సమావేశం చర్చించి తీర్మానం చేశారు.



కార్యక్రమం ప్రారంభంలో అతిథులు, నిర్వాహకులు

## ఊటీ కొండ రైలును అడ్డుకున్న ఏనుగు

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ కొండరైలు మార్గంలో ఆదివారం ఉదయం ఓ ఏనుగు సంచరించింది. మేట్టుపాళయం నుండి ఊటీకి వస్తున్న కొండ రైలును అడ్డుకుంది. కున్నూరు సమీపం మరపాలం ప్రాంతం వద్దనున్న కొండ రైలు మార్గం పట్టాలపై ఆ ఏనుగు అటూ ఇటూ సంచరించింది. ఆ సమయంలో కొండరైలు వచ్చింది. పట్టాలపై ఉన్న ఏనుగును చూసిన డ్రైవర్ వెంటనే రైలును నిలిపివేశారు. ఆ తర్వాత డ్రైవర్ హారన్ మోగించిన ఆ ఏనుగు పట్టాలపై నుంచి కదలలేదు. కాసేపయ్యాక ఏనుగు అడవిలోకి వెళ్లాక కొండరైలు అక్కడి నుండి బయలుదేరింది.



కొండరైలు మార్గం పట్టాల వద్ద నిలిచి ఉన్న ఏనుగు

## మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

● సీబీఎఫ్ వార్షికోత్సవంలో పాస్టర్ జడ వసంతబాబు

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతీచోట పురుషులతో సమానంగా గౌరవాన్ని అందుకోగలిగినప్పుడే సమాజం పురోగాభివృద్ధి సాధిస్తుందని సీబీఎఫ్ డైరెక్టర్ పాస్టర్ జడ వసంత బాబు పేర్కొన్నారు. స్థానిక కొడుంగైయూర్ ప్రణీత ప్యాలెస్‌లో శనివారం సాయంత్రం సంస్థ 25వ వార్షికోత్సవ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని విద్యార్థులు, మహిళలకు సంక్షేమ సహాయాలు అందించారు. ఈ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నెల్లూరులోని లోన్‌స్టార్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ డా.కంచెర్ల ప్రభుదాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జడ విశ్వవాణి, బ్లెస్సీ షెరాఫ్, జస్టిన్ పాల్ సారథ్యంలో క్వయర్ బృందం ప్రత్యేక గీతాలు శ్రావ్యంగా ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు.



వార్షికోత్సవంలో జడ వసంత బాబు, విశ్వవాణి దంపతులు

## సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం ఏర్పాట్ల పరిశీలన

తిరుత్తణి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆ నియోజకవర్గ ప్రజలు కొన్ని రోజులుగా కోరుతున్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ఈ విషయంపై ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి అనుమతులు రావడంతో కలెక్టర్ ప్రతాప్ విగ్రహం ఏర్పాటుకు స్థలసేకరణ చేపట్టారు. ఈ క్రమంలో తిరుత్తణి రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని ఆదివారం ఉదయం మంత్రి నాజర్, కలెక్టర్ ప్రతాప్, ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, దేశ రాష్ట్రపతి స్థాయికి ఉదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని తిరుత్తణిలో ఏర్పాటు చేయడం తనకు ఎంతో సంతోషకరమన్నారు. ఈ విగ్రహాన్ని సర్వేపల్లి జయంతి సందర్భంగా సెప్టెంబరు 5వ తేదీ ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎం.భూపతి, రెవెన్యూ డివిజనల్ కమిషనర్ కనిమొళి, మలర్విళి సహా పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

## చెన్నై-తూత్తుకుడి విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై-తూత్తుకుడి విమానంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని పైలెట్ సకాలంలో గుర్తించడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. నగరం నుంచి 65 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది మొత్తం 70 మందితో ఆదివారం ఉదయం 10.10 గంటలకు తూత్తుకుడికి స్పైస్ జెట్ విమానం టేకాఫ్ ఎకు సిద్ధం కాగా, యంత్రంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన పైలెట్, విమానాశ్రయ అధికారులకు తెలియజేశాడు. అధికారుల సూచనలతో విమానాన్ని పార్కింగ్ ప్రాంతానికి తీసుకొచ్చారు. తొలుత విమానం ఆలస్యంగా బయల్దేరుతుందని ప్రకటించిన అధికారులు, మరో విమానంలో ప్రయాణికులను తూత్తుకుడికి పంపించారు.

## రూ.60 లక్షల విలువైన బీడీ ఆకుల స్వాధీనం

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి నుంచి సముద్రమార్గంలో చట్ట విరుద్ధంగా శ్రీలంకకు తరలించేందుకు యత్నించిన రూ.60 లక్షల విలువైన బీడీ ఆకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీడీ ఆకులు తరలిస్తున్నట్టు తూత్తుకుడి క్యూబ్రాంచ్ పోలీసులకు అందిన సమాచారంతో శనివారం రాత్రి నుంచి తూత్తుకుడి సముద్రతీరంలో గస్తీ చేపట్టారు. పోలీసులను చూసి బీచ్‌రోడ్డు మీదుగా వచ్చిన వ్యక్తులు లారీ ఆపి కిందకు దిగి చీకట్లో పరారయ్యారు. లారీలో తనిఖీ చేసిన పోలీసులు 68 బస్తాల్లో ఉన్న 2,226 కిలోల బీడీ ఆకులను, లారీని స్వాధీనం చేసుకుని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు.

## ప్రయాణికురాలికి వేధింపులు టిక్కెట్ కలెక్టర్ అరెస్ట్

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడి టిక్కెట్ కలెక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరం నుంచి మంగళూరుకు ఈ నెల 3న వెస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ బయల్దేరింది. తిరుప్పూర్ మురుగంపాళయానికి చెందిన 34 ఏళ్ల మహిళ, తన భర్తతో కలసి ఈ రైలులో వెళ్లేందుకు సాధారణ టిక్కెట్ తీసుకున్నారు. ఈ రైలులో టిక్కెట్ కలెక్టర్‌గా ఉన్న వేలూరు జిల్లా పుళిమంగళానికి చెందిన భారతి దంపతులను టిక్కెట్ చూపించాలని కోరగా వారు ఇచ్చారు.. సాధారణ టిక్కెట్లు కొని ఏసీ బోగీలో ఎలా ప్రయాణిస్తారంటూ, వారిని మరో బోగీలోకి తీసుకెళ్లాడు. భర్తను ఒక బోగీలో ఉంచి, మహిళను మరో బోగీలోకి తీసుకెళ్లి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. రైలు తిరుప్పూర్ స్టేషన్‌కు వచ్చిన వెంటనే సదరు మహిళ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై విచారించిన రైల్వే పోలీసులు టీసీని అరెస్ట్ చేశారు.

## రేపు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై, అన్నానగర్, గిండి, పొన్నేరి డివిజన్ పరిధిలో మంగళవారం (ఈ నెల 8వ తేది) విద్యుత్ గ్రీవెన్స్ జరగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో.. చింతాద్రిపేట లాబాంట్ వీధిలోని అన్నాసాలై డివిజన్ కార్యాలయం, అన్నానగర్ 11వ మెయిన్ రోడ్డులోని అన్నానగర్ డివిజన్ కార్యాలయం, గిండి పరిధిలో కేకే నగర్ ఉప విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోని కార్యాలయం, పొన్నేరి పరిధిలోని వెంబాక్కం టీహెచ్ రోడ్డు సమీపంలోని ఉప విద్యుత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

## బాణసంచా కర్మాగారంలో పేలుడు

●కార్మికుడి మృతి

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాత్తూరు వద్దనున్న బాణసంచా కర్మాగారంలో ఆదివారం ఉదయం సంభవించిన పేలుడులో ఓ కార్మికుడు మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. శివకాశి సమీపం తిరుతంగలై ప్రాంతానికి చెందిన గణేషన్ అనే వ్యక్తి సాత్తూరు సమీపం కీళ్‌తాయిల్‌పట్టిలో బాణసంచా కర్మాగారాన్ని నడుపుతున్నాడు. ఆ కర్మాగారంలో ఫ్యాన్సీ రకం టపాసులు ఎక్కువగా తయారవుతున్నాయి. కర్మాగారంలో సుమారు వంద మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆ కర్మాగారంలో రసాయన పదార్థాల గదిలో ఉన్నట్టుండి పేలుడు సంభవించింది. ఆ పేలుడుకు 15 గదులు నేలమట్టమయ్యాయి. పేలుడికి పనైయడిపట్టి ప్రాంతానికి చెందిన బాలగురుసామి అనే కార్మికుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. రాజశేఖర్, రాజపాండి, కన్నన్, కమలేష్, రాజేష్ అనే ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా పోరాడారు. శిథిలాల మధ్య చిక్కుకున్న కార్మికులను వెలికి తీశారు. వెంబోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## సమాచార దర్శిని

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అరుంబాక్కం, తాంబరం ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**అరుంబాక్కం:** జయ్ నగర్ 4 నుంచి 7 వీధులు, ప్రహదీశ్వరర్ నగర్, దురైపిళ్లై వీధి, ఇందిరా గాంధీ వీధి, కవిత వీధి, నెహ్రూ వీధి, నెహ్రూ నగర్, వీనా గార్డన్, వీబీ నగర్, న్యూ స్ట్రీట్

**తాంబరం:** మాడంబాక్కం, సుదర్శన్ నగర్, అంబికా నగర్, జ్ఞానానంద నగర్, గణపతి నగర్, జైన్ సుదర్శన్, రేణుకాంబాళ్ నగర్, రాఘవేంద్ర నగర్, కృష్ణా నగర్, అన్నా గార్డన్

### వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 27న 'తెలుగు పద్య వైభవం'పై ప్రసంగం

టి.నగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక ఈ నెల 27న జరుగనుంది. 163వ ప్రసంగంగా 'తెలుగు పద్య వైభవం' అనే అంశంపై పాలకొల్లు విశ్రాంత ప్రధానాచార్యులు చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి పద్యగాన సహిత సాహితీ ప్రసంగం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు టి.నగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో ఈ ప్రసంగ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

### 8న శ్రీరంగంలో జ్యేష్ఠాభిషేకం

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగం వైష్ణవ క్షేత్రంలోని రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం మూలవర్ పెరుమాళ్‌కు జ్యేష్ఠాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.. ఈ ఆలయంలో జరుపుకునే ప్రత్యేక ఉత్సవాల్లో మూలస్థానంలో కొలువుదీరిన పెరుమాళ్‌కు జ్యేష్ఠాభిషేకం నిర్వహించే రోజంతా దర్శనానికి భక్తులను అనుమతించరు. ఆ రీతిలో వచ్చే మంగళవారం ఉదయం నుండి బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు స్వామివారి దర్శనాన్ని రద్దుచేస్తున్నట్లు ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

### నేటి నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సోమవారం నుంచి కౌన్సెలింగ్ జరగనుంది. తొలిరోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కల్పించిన 7.5 శాతం అంతర్గత రిజర్వేషన్ కోటాలో కౌన్సెలింగ్ జరుగుతుంది. ఆ తర్వాత ఈ నెల 14 నుంచి జనరల్ విద్యార్థుల కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని తమిళనాడు ఇంజనీరింగ్ అడ్మిషన్స్ (టీఎన్ఈఏ) విభాగం అధికారులు తెలిపారు. కాగా, ఈ ఏడాది డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

### వేర్‌హౌస్‌ల కల్పనలో బీఈఎంఎల్ ముందంజ

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధనలకు దోహదపడేలా అన్ని సదుపాయాలతో కూడిన వేర్‌హౌస్ (గిడ్డంగు)లను నిర్మించడంలో బీఈఎంఎల్ ముందంజలో ఉందని ఆ సంస్థ ఛైర్మన్ శాంతను రాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల బెంగళూరు ఏరోస్పేస్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో కొత్తగా వేర్‌హౌస్ ప్రారంభించామని, ఆ సెజ్‌లోనే త్వరలో 1.15 ఎకరాల్లో రెండో ప్రాజెక్టు కూడా చేపట్టనున్నామన్నారు. తమ సంస్థ రక్షణ, విమానయాన రంగాల అభివృద్ధికి దోహదం చేసేలా మెరుగైన వసతులతో గిడ్డంగులను నిర్మించనుందని, తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల్లోనూ తమ సంస్థ సేవలను విస్తరింపజేస్తామని ఆయన వివరించారు.

### 1 నుంచి బడిలో చేరని పిల్లల గణన

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చేరని 6 నుంచి 18 ఏళ్ల వారి గణన ఆగస్టు 1 నుంచి చేపట్టనున్నట్లు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీచేసింది. పాఠశాలల్లో చేరే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్య పూర్తిచేసేలా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. 5 ఏళ్లలోపున్న పిల్లలను అంగన్వాడీ కేంద్రాలు, ఐదేళ్లకు పైబడిన వారు ప్రభుత్వ పాఠశాలలు, పాఠశాల చదువు పూర్తిచేసుకున్న వారు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులకు రాయితీలు, ఉపకార, ప్రోత్సాహక వేతనా లు అందిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆర్థికస్థోమత, ఇతర కారణాలతో పాఠశాలల్లో చేరని పిల్లల వివరాలు ఆగస్టు 1వ తేది నుంచి సేకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

### వృద్ధాశ్రమాలు, మహిళల విడిది గృహాల నమోదు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమాలు, మహిళల విడిది గృహాల నమోదు, లైసెన్స్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని మహిళల విడిది గృహాలు, వృద్ధాశ్రమాలు తదితరాలు నమోదుచేసుకొనేందుకు కొత్త మార్గదర్శకాలు రూపొందించారు. ఆ ప్రకారం, తమిళనాడు కేబుల్ సేవా కేంద్రంలో ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఈ విభాగం ద్వారా వృద్ధాశ్రమాల నమోదు, కొత్త మహిళల విడిది గృహాల ప్రారంభ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

### వాషర్‌మెన్‌పేటలో ట్రాఫిక్ మార్పులు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాషర్‌మెన్‌పేటలో ట్రాఫిక్ మార్పులు సోమవారం అమలుకు రానున్నాయి. ఈ ప్రకారం, మింట్ నుంచి వచ్చే బస్సులు, భారీ సరుకు వాహనాలు టీహెచ్ రోడ్డు, సిమెట్రీ రోడ్డు జంక్షన్, ఎమ్మెస్ ఆలయ వీధి, ఎస్ఎన్ చెట్టి రోడ్డు, జీవరత్నం రోడ్డు మీదుగా టీహెచ్ రోడ్డు అపోలో జంక్షన్ చేరుకోవాలి. మింట్ నుంచి టీహెచ్ రోడ్డు జంక్షన్ వెళ్లే ద్విచక్రవాహనాలు, తక్కువ సరుకు వాహనాలు యదావిధిగా వెళ్లవచ్చు. ఇక, అపోలో జంక్షన్ నుంచి టీహెచ్ రోడ్డు మీదుగా మింట్ వైపుకు వాహనాలు యథావిధిగా వెళ్లవచ్చని నగర్ ట్రాఫిక్ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది.

### 12న గ్రూప్-4 హాల్‌టికెట్ల విడుదల

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షల హాల్‌టికెట్లను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న 3,935 గ్రూప్-4 పోస్టులను భర్తీ చేసేందుకు పరీక్షలు నిర్వహించేందుకు టీఎన్‌పీఎస్సీ ఏర్పాట్లు చేపట్టింది. కాగా, www.tnpsc.gov.in వెబ్‌సైట్ నుండి అభ్యర్థులు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## రక్తదాతలకు పురస్కారాలు



వేలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసిన వారిని అభినందించే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఏపీజే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారి అభినందన కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షుడు గోపి అధ్యక్షత వహించారు. ఆర్కాడు ఆలయాల సంఘం అధ్యక్షుడు జానకిరామన్ ముఖ్యఅతిథిగా పాల్గొని, రక్తదానం చేసిన వారికి 'హీరోస్ ఆఫ్ ఎమర్జెన్సీ' అనే పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్కాడు పారిశ్రామికవేత్త ఆర్కాడు శ్యామరాజ్, మేల్‌విశారం మున్సిపాలిటీ కమిషనర్ పళని, ట్రస్ట్ అధ్యక్షుడు తమిళ్‌వానన్, ముస్లిం తమిళ్ సంఘ అధ్యక్షుడు మహ్మద్ సర్ఫుద్దీన్, అబ్దుల్ హకీల్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఇస్మానుల్లా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటు చేసుకుంది. లింగంపట్టి వెస్ట్ వీధికి చెందిన మార్టిన్ (45) తన పొలంలో మొక్కజొన్న సాగుచేస్తున్నాడు. పంటను అడవి పందులు ధ్వంసం చేయకుండా పొలం చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటుచేశాడు. ఘటన జరిగిన రోజున పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన మార్టిన్ ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతుకుతూ పొలానికి వెళ్లారు. అక్కడ విద్యుదాఘాతంతో మార్టిన్ మృతిచెంది కనిపించారు. సమాచారం అందుకున్న నాలాట్టిన్‌పుదూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూత్తుకుడి ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## ఐదు పార్కుల్లో రూ.81 లక్షలతో వ్యాయామ ఉపకరణాలు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలోని మౌలానా నగర్, ఓల్డ్ స్టేట్ బ్యాంక్ కాలనీ, ఓల్డ్ తాంబరం, 4వ మండల కార్యాలయం, శక్తి నగర్ తదితర ఐదు ప్రాంతాల్లో పార్కుల్లో తలా రూ.16 లక్షలతో వ్యాయామ పరికరాలు ఏర్పాటుచేశారు. ఈ మేరకు తాంబరం కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుతం పార్కుల్లో వాకింగ్, వ్యాయామం చేసే వారి సంఖ్య పెరుగుతోందన్నారు. పిల్లలు, యువకులు వ్యాయామం చేసేందుకు వీలుగా ఐదు పార్కుల్లో రూ.81 లక్షలతో ఉపకరణాలు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు.

## 2,229 గ్రామ సహాయకుల పోస్టులకు అనుమతి

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న 2,220 గ్రామ సహాయకుల పోస్టులను భర్తీ చేయాలని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, నియామకాలకు సంబంధించిన జీవో విడుదల చేసింది. రాష్ట్రంలోని జిల్లాల వారీగా రెవెన్యూ శాఖలో మూడేళ్లకు పైగా ఖాళీగా ఉన్న గ్రామ సహాయకుల పోస్టులను స్పెషల్ టైమ్ సిస్టిమ్ పద్ధతిలో రూ.11,100-రూ.35,100 వేతనంతో నియామకాలు చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు చివరి పాఠశాల పరీక్షల్లో తమిళం ఒక పాఠ్యాంశంగా కలిగి, 21 ఏళ్లు నిండి, ఆయా తాలూకాకు చెందిన వారై ఉండాలి. దరఖాస్తులను పూర్తిచేసి సంబంధిత తాలూకా అధికారికి స్వయంగా, పోస్టు ద్వారా సంబంధిత పత్రాలతో సమర్పించాలని ప్రభుత్వం తెలిపింది.

## ఆక్రమణ భూముల స్వాధీనం

వేలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి తాలూకా వెంకటాపురంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అరుంధతీయ కాలనీలో ఆరు నెలల క్రితం ప్రభుత్వ భూములను ఓ వ్యక్తి ఆక్రమించాడు. ఈ విషయమై బెల్ సంస్థలో పనిచేస్తున్న గీతా వెంకటేశన్ నేతృత్వంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఉత్తర్వులతో కాట్పాడి తహసీల్దార్ జగదేశ్వరన్, మేల్పాడి ఆర్ఐ, తెన్‌పల్లి గ్రామ నిర్వహణ అధికారి, రెవెన్యూ సిబ్బంది ఆక్రమణ భూములు స్వాధీనం చేసుకుని, 'ఇది ప్రభుత్వ స్థలం' అంటూ బోర్డు ఏర్పాటుచేశారు.

## వరదల్లో వినియోగించిన పడవల అద్దె చెల్లింపు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరద సహాయక చర్యల్లో వినియోగించిన పడవల అద్దెను సోమ, మంగళవారాల్లో అందజేయనున్నట్లు మత్స్య శాఖ కమిషనర్ గజలక్ష్మి తెలిపారు. గత ఏడాది నవంబరు, డిసెంబరులో వరద, తుఫాను సహాయక చర్యలకు చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాలకు చెందిన జాలర్ల నుంచి ఫైబర్ పడవలు అద్దెకు తీసుకొచ్చి, వాటిని నడిపేందుకు తలా ఇద్దరిని నియమించారు. పడవలు, వాటిని నడిపిన వారికి మత్స్యశాఖ, కార్పొరేషన్ ద్వారా అద్దె, వేతనం అందిస్తామని తొలుత ప్రకటించారు. కానీ, ఆరు నెలలు దాటినా అద్దె, వేతనం అందించలేదని జాలర్లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో, పడవల అద్దె, సహాయకులకు వేతనం సోమ, మంగళవారాల్లో అందజేయనున్నట్లు మత్స్యశాఖ కమిషనర్ తెలిపారు.

## సిలిండర్ పేలి ఐదు గుడిసెల దగ్ధం

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక జల్లడియన్‌పేటలో సిలిండర్ పేలిన ఘటనలో ఐదు గుడిసెలు దగ్ధమయ్యాయి. కోవలన్ వీధిలో కొందరు ఉత్తరాది కార్మికులు గుడిసెల్లో ఉంటున్నారు. వారు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్ శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పేలి, మంటలు చెలరేగాయి. ఆ గుడిసెతో పాటు సమీపంలోని నాలుగు గుడిసెలకు మంటలు వ్యాపించాయి. మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చుట్టుపక్కల వారు మంటలపై నీళ్లు చల్లి అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పళ్లికరనై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## పాలారు తీరంలో మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం సమీపం అగరంచేరిలో ఉన్న పాలారు నదీ తీరంలో కిలో మీటరు మేర 2,000 మొక్కలు నాటే పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ఆంబూరు ఎమ్మెల్యే విల్వనాధన్ అధ్యక్షత వహించగా, గుడియాత్తం సబ్ కలెక్టర్ సుబ్బలక్ష్మి ఆహ్వానం పలికారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ తిరుమాళ్ మాధవన్, మాధనూరు కౌన్సిలర్ ఆనంది, అగరంచేరి పంచాయతి అధ్యక్షుడు రాజ్‌కుమార్, బీడీఓ శరవణన్, సమాజ సేవకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నరసాపూర్-తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నరసాపూర్-తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 07219 నెంబరు నరసాపూర్-తిరువణ్ణామలై ప్రత్యేక రైలు ఈ నెల 9, 16, 23 తేదీల్లో రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకు నరసాపూర్ నుండి బయలుదేరి మరుసటి రోజు వేకువజాము 4.55 గంటలకు తిరువణ్ణామలై చేరుతుంది. అదే విధంగా ఆగస్టు 6, 13, 20 తేదీల్లోను, సెప్టెంబరు 3, 24 తేదీల్లోనూ నరసాపూర్ నుండి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి తిరువణ్ణామలైకి మరుసటి రోజు వేకువజాము 4.55 గంటలకు చేరుతుంది. 07220 నెంబరు తిరువణ్ణామలై-నరసాపూర్ ప్రత్యేక రైలు ఈ నెల 10, 17, 24 తేదీల్లోనూ ఆగస్టు 7, 14, 21 తేదీలు, సెప్టెంబర్ 4, 25 తేదీల్లోనూ తిరువణ్ణామలైలో ఉదయం 11 గంటలకు బయలుదేరి మరుసటిరోజు వేకువజామున 2 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, వేలూరు మీదుగా వెళతాయని దక్షిణ రైల్వే అధికారులు పేర్కొన్నారు.

# సినిమా ప్రమోషన్ల కోసం విద్యా సంస్థలా? : శశికుమార్

సినిమా ప్రమోషన్లు, ఆడియో, ట్రైలర్ రిలీజ్ కోసం విద్యా సంస్థలను ఉపయోగించుకోవడంలో తనకు ఏమాత్రం ఇష్టం లేదని ప్రముఖ నటుడు శశికుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు కేవలం విద్య బోధించడానికి మాత్రమేనని, అలాంటి చోట సినిమా కార్యక్రమాల నిర్వహణకు తాను పూర్తిగా వ్యతిరేకమని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. శశికుమార్, లిజో మోల్ జోస్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఫ్రీడమ్'. ఇతర పాత్రల్లో సుదేష్ నాయర్, మాళవిక, బోస్ వెంకట్, రమేష్ ఖన్నా తదితరులు నటించారు. ఈ నెల 10వ తేదీ విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని చిత్రం ఆడియో శనివారం నగరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో శశికుమార్ మాట్లాడుతూ, 'ఈ మూవీ యాదృచ్ఛికంగా జరిగింది. ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరగలేదు. నిజానికి 'టూరిస్ట్ ఫ్యామిలీ'కి ముందే విడుదలకావాల్సి ఉంది. 'సుదంతిరం'(స్వాతంత్ర్యం) అనే టైటిల్ పెట్టాలని ముందుగా భావించాం. ఆ టైటిల్‌తో ఒక సినిమా వచ్చింది. 'విడుదలై' అనే పేరు పెట్టేందుకు వీలులేదు. ఇపుడు ప్రతి ఒక్కటీ ఓటీటీ చేతుల్లోకి ఉంది. చివరకు టైటిల్స్ కూడా వారి నియంత్రణలోనే ఉన్నాయి. అందుకే 'ఫ్రీడమ్' అనే టైటిల్ ఎంచుకున్నాం. భవిష్యత్‌లో నా చిత్రాలను విద్యా సంస్థల్లో ప్రమోషన్ కార్యక్రమాలు చేస్తే అది మేకర్స్ నిర్ణయమేగానీ, నా వ్యక్తిగత నిర్ణయం కాదని శశికుమార్ స్పష్టం చేశారు. ఆ తర్వాత దర్శక నిర్మాతలు, హీరోయిన్, ఇతర నటీనటులు తమతమ అభిప్రాయాలను పంచుకున్నారు. విజయ గణపతి పిక్చర్స్ పతాకంపై పాండియన్ పరశురామన్ నిర్మించిన ఈ చిత్రానికి సత్యశివ దర్శకత్వం వహించారు.



ఆడియో రిలీజ్ వేడుకలో 'ఫ్రీడమ్' చిత్ర బృందం



## ధనుష్ సరసన పూజా హెగ్డే?

ప్రముఖ హీరో ధనుష్ నటించే కొత్త చిత్రంలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. వాస్తవానికి ఈ ప్రాజెక్టు కోసం ముందుగా మలయాళ భామ మమితా బైజును ఎంపిక చేసినప్పటికీ, చివరి నిమిషంలో పూజా హెగ్డేను తీసుకున్నట్టు సమాచారం. 'ముగమూడి' అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన పూజా హెగ్డే.. విజయ్‌తో 'బీస్ట్', సూర్యతో 'రెట్రో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. ప్రముఖ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేష్ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించే ఈ చిత్రానికి 'పోర్ తొళిల్' ఫేం విఘ్నేష్ రాజా దర్శకుడు. ఈ నెల 15 నుంచి షూటింగ్ ప్రారంభంకానుంది. కాగా, 'కుబేర'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ధనుష్ ప్రస్తుతం ఆయన తెరకెక్కించిన 'ఇడ్లీకడై' విడుదలకు సిద్ధంగా ఉండగా, 'తేరే ఇష్క్ మైన్' అనే బాలీవుడ్ మూవీ ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది.

## హీరోగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు?

చిత్రజ్యోతి

తొలిసారి దర్శకత్వం చేపట్టి, 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి మెగా బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన యువ దర్శకుడు అభిషన్ జీవింత్ వెండితెరపై హీరోగా కనిపించనున్నారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ'లో ఓ చిన్న పాత్రలో కనిపించారు. పైగా తాను దర్శకత్వం వహించిన తొలి చిత్రమే భారీ హిట్‌గా నిలిచింది. దీంతో ఆయన దర్శకత్వం వహించే రెండో చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, తన రెండో చిత్రానికి తాను దర్శకత్వం వహించకుండా హీరోగా నటించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ సినిమాకు మరో కొత్త డైరెక్టర్ దర్శకత్వం వహించనున్నారు. హీరోయిన్‌గా అనస్వర రాజన్‌ను ఎంపిక చేసినట్టు సమాచారం. ఈ మూవీకి 'కరెక్టెడ్ మచ్చీ' అనే పేరు ఖరారు చేశారు.. ఈ విషయం బయటకు పొక్కగానే సోషల్ మీడియా వేదికగా అభిషన్‌కు పలువురు సినీ ప్రముఖులు విషెస్ చెబుతున్నారు. అయితే, ఈ ప్రాజెక్టు నిర్మాత, నిర్మాణ సంస్థ తదితర వివరాలను వెల్లడికావాల్సివుంది.


అభిషన్ జీవింత్



## వడివేలు - ఫహద్ ప్రధాన పాత్రల్లో 'మారీసన్'

ప్రముఖ హాస్య నటుడు వడివేలు, మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మారీసన్'. ఈ నెల 25న విడుదలకానుంది. సుధీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు వి.కృష్ణమూర్తి స్టోరీ, స్క్రీన్‌ప్లే, మాటలను సమకూర్చి క్రియేటివ్ డైరెక్టరుగా పనిచేశారు. వడివేలు, ఫహద్‌తో పాటు కోవై సరళ, వివేక్ ప్రసన్న, చిత్ర, పీఎల్ తేనప్పన్, లివింగ్‌స్టన్, రేణుక, శరవణ సుబ్బయ్య, కృష్ణ హరిత, టెలిఫోన్ రాజా తదితరులు నటించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి సూపర్ గుడ్ ఫిలిమ్స్ పతాకంపై నిర్మించిన 98వ చిత్రం. గ్రామీణ నేపథ్యంలో ట్రావెలింగ్ థ్రిల్లర్‌గా రూపొందించగా ఈ నెల 25వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.

# కుటీర పరిశ్రమలకు నష్టం లేకుండా విద్యుత్ ఛార్జీల పెంపు

● మంత్రి శివశంకర్


కోవైలో కొత్త బస్సు సేవలను ప్రారంభిస్తున్న మంత్రి శివశంకర్

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేద,మధ్య తరగతి ప్రజలకు, చిన్న, కుటీర పరిశ్రమలకు నష్టకలుగకుండా రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచినట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శివశంకర్ పేర్కొన్నారు. కోవై కొడిసియా గ్రౌండులో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వంద ప్రభుత్వ బస్సులను ప్రారంభించిన సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాజధాని నగరంలో ఇటీవల ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయని, ఆ రీతిలో పరిశ్రమలు అధికంగా ఉన్న కోయంబత్తూరు, పుణ్యక్షేత్రాలు కలిగిన మదురై నగరాలకు త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సు సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రెండు ప్రాంతాలకు 500 బస్సులు కొనుగోలు చేసేందుకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ నెల 1వ తేదీ నుంచి విద్యుత్ ఛార్జీల పెంపు అమలుకు వచ్చిందని, దీనివల్ల పేద-మధ్య తరగతి ప్రజలు, కుటీర పరిశ్రమల వారికి ఎలాంటి నష్టం ఉండబోదన్నారు.

## తిరువణ్ణామలై క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వరుసగా సెలవులు రావడంతో తిరువణ్ణామలై శైవక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉన్నామలై అమ్మవారి సమేత అన్నామలైయార్ కొలువుదీరిన తిరువణ్ణామలై ఆలయం ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయానికి ప్రతిరోజు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగురాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. సహజంగా పండుగలు, సెలవు రోజుల్లో ఈ ఆలయానికి తరలివెళ్ళే భక్తుల సంఖ్య సుమారు 30వేలకు పైగా ఉంటుంది. ఆ రీతిలో శని,ఆదివారాల్లో తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ సహా పలు రాష్ట్రాల నుంచి వచ్చారు. దీంతో తిరువణ్ణామలైలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. సెంట్రల్ బస్‌స్టేషన్, అన్నామలైయార్ ఆలయం చుట్టూవున్న మాడవీధుల్లో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లలో సుమారు 3 గంటల పాటు భక్తులు వేచివుండి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

## హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూలులో మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన



ప్రచార ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూస్థాన్ ఇంటర్నేషనల్ స్కూలులో మాదక ద్రవ్యాల నిరోధంపై నిర్వహించిన అవగాహన ప్రచార కార్యక్రమంలో వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి చెన్నై జోన్ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సూపరింటెండెంట్ దీపక్ కౌశిక్ నేతృత్వం వహించారు. ఆ సందర్భంగా విద్యార్థులచేత మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దీపక్ కౌశిక్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళకూడదని, చక్కగా చదువుకుని ఉన్నత పౌరులుగా రాణించాలని పిలుపునిచ్చారు. హిందూస్థాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ జేకబ్ వర్గీస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు అవగాహన కల్పించే రీతిలో ఇలాంటి ప్రచార కార్యక్రమాలను నిర్వహించిన అధ్యాపకులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని చెప్పారు.

## నేడు 113 ఆలయాల కుంభాభిషేకం

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సోమవారం 113 ఆలయాల కుంభాభిషేకం జరుగనుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలతో, హిందూ దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు, ఆ శాఖ అధికారుల కృషితో నాలుగేళ్లలో 3,176 ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించారు. తాజాగా 31 జిల్లాల్లోని 113 ఆలయాల్లో సోమవారం కుంభాభిషేకం జరుగనుంది.సోమవారం తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం జరుగనుంది. అలాగే, కన్నియాకుమారి జిల్లా వెళిమలై ఇసైక్కిఅమ్మన్ ఆలయం, మైలాదుదురై జిల్లా తిరువేంగాడు సువేదారణ్యేశ్వరర్ స్వామి ఆలయం, కాంచీపురం జిల్లా వెల్లకోట మురుగన్ ఆలయం, తెన్‌కాశి జిల్లా కడయం నిత్యకల్యాణి అమ్మన్ ఆలయం, రాణిపేట జిల్లా షోలింగర్ చిన్నమలై యోగాంజనేయస్వామి ఆలయం సహా 113 ఆలయాల్లో కుంభాభిషేకం జరుగనుంది. ఈ వేడుకలకోసం యాగశాల పూజలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

# కేఎంజే ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాలు


విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కొల్లిపార మాజేటి జయశ్రీ (కేఎంజే) ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు మీడియం విద్యార్థులకు ఆదివారం ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం జరిగిది. ఎగ్మూర్‌లోని రమడ హాలులో మేనేజింగ్ ట్రస్టీలు డాక్టర్ ఎంఎస్ చంద్రగుప్తా, ఎం.తనూజ దంపతుల నేతృత్వంలో సాగిన 4వ వార్షిక ఉపకారవేతనం పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెన్నై ఇన్ కమ్‌టాక్స్ రెవెన్యూ కమిషనర్ నందకుమార్, గౌరవ అతిథిగా వెపేరి ఏసీపీ ఆర్ కన్నన్ హాజరై 1 నుంచి పీహెచ్‌డీ వరకు తెలుగు మీడియంలో చదువుకుంటూ అధిక మార్కులు సాధించిన 110 మంది విద్యార్థిని, విద్యార్థులకు రూ.1000 నుండి రూ.5000 వరకు ఉపకారవేతనాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా దివంగత ఆడిటర్ మాజేటి సూరయ్య- డాక్టర్ మాజేటి జయశ్రీ దంపతుల చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం ఆమె రచనలతో ముద్రించిన పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐటీ కమిషనర్ నందకుమార్ మాట్లాడుతూ, తెలుగు భాష మీద పెంచుకున్న ప్రేమతో మాజేటి జయశ్రీ తెలుగు మీడియం విద్యార్థుల అభ్యున్నతికి చేసిన కృషి ఎనలేనిదని, ఆమె సేవలను చిరస్మరణీయమని కొనియాడారు. నగరంలోని డీఆర్‌బీసీసీ, క్వీన్ మేరీస్, ప్రెసిడెన్సీ, మద్రాస్ యూనివర్శిటీలలో బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ తెలుగు మీడియం విద్యార్థులతో పాటు ఉపకారవేతనం అందుకున్న తెలుగు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు తెలుగు సంఘాల నిర్వాహకులు, తెలుగు తరుణి అధ్యక్షురాలు కాసల రమణి, మాజేటి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చిన గవర్నర్ ఆర్.ఎన్.రవిని మర్యాద పూర్వకంగా కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఏ.జె.శేఖర్

## ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించేందుకు చేపల ఆకారంలో తొట్టెలు

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించేలా ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటుచేసిన చేపల ఆకారపు తొట్టెలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఈ బీచ్‌లో సుమారు వెయ్యికి పైగా దుకాణాలుండగా, వాటిలో వినియోగించే ప్లాస్టిక్ వ్యర్థాలను ఇసుకలో పడవేస్తుండడం, ఈ వ్యర్థాలు సముద్రంలో కలుస్తుండడం చేపలు, ఇతర సముద్ర జీవులకు ప్రాణాంతకంగా మారింది. దీనిని నివారించేలా ఓ స్వచ్ఛంద సంస్థ రంగులతో రూపొందించిన చేపల ఆకారపు తొట్టెలు బీచ్ ప్రాంతంలో ఏర్పాటుచేశారు.. దుకాణ యజమానులు, పర్యాటకులు తాము వినియోగించి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ తొట్టెల్లో వేయాలని సంస్థ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.


బీసెంట్ నగర్ బీచ్‌లో ఏర్పాటైన తొట్టెలు

## సహకారశాఖ ఆధ్వర్యంలో మినీ మారథాన్

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ఆ శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ ప్రారంభించిన మినీ మారథాన్‌లో సుమారు 2వేల మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో ఈ పోటీ నిర్వహించారు. మెరీనా బీచ్ సమీపంలోని ఐల్యాండ్ గ్రౌండునుంచి ప్రారంభమై 5 కిలోమీటర్ల మేర సాగిన ఈ మినీ మారథాన్‌ను ఆ శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ జెండా ఊపి ప్రారంభించారు. 18 నుంచి 40యేళ్ళ వరకు వున్న పురుషులు, మహిళలు పాల్గొన్న ఈ పోటీల్లో ప్రథమ బహుమతిగా సునీల్‌కు రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా అన్బరసుకు రూ20వేలు, తృతీయ బహుమతిగా అనుప్రియకు రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, సహకార సంఘా రిజిస్ట్రార్ నందకుమార్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మినీ మారథాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెరియకరుప్పన్





కన్నెపూజలో వాసవీ క్లబ్‌ల నిర్వాహకులు

# సీఎంఆర్ వాసవీ బజార్‌కు విశేష స్పందన

● వైభవంగా కన్నెపూజ

ప్యారీస్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి502ఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీఎంఆర్ వాసవీ బజారుకు విశేష స్పందన లభించింది. స్థానిక ఎస్‌కేపీడీ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లా గవర్నర్ సీఎం రాజేష్-శైలశ్రీ దంపతుల అధ్యక్షతన కన్నిపూజ, ట్యాలెంట్‌షో, సీనియర్ సిటిజన్ల సమావేశం, దాండియా డ్యాన్స్ కార్యక్రమాలతో సందడి నెలకొంది. ముందుగా వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదికపై 12 నుంచి 13యేళ్ళలోపు 55 మంది ఆడపిల్లలను అమ్మవారి రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. కన్నెపూజ ప్రాజెక్ట్ చైర్మెన్ ఎస్‌వీ. పద్మనాభన్-విష్ణుప్రియ దంపతులు పూజలో పాల్గొన్న వారికి 30 రకాల వస్తువులను అందజేశారు. క్యాబినెట్ సెక్రటరీ బండారం అనంత పద్మనాభన్-తనూజ, ట్రెజరర్ ఆర్‌వీఎల్.రత్నకుమార్-భారతి, మాజీ గవర్నర్లు డాక్టర్ ఎంవీ నారాయణగుప్తా, సుజాత రమేష్‌బాబు, నామా సతీష్‌కుమార్, పి.సుబ్బయ్య, చారుగుండ్ల వెంకటేశ్వరరావు, ఓలేటి లక్ష్మి, వాసవీయన్ డి.ఉపేంద్రకుమార్ సహా వాసవీ క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. వాసవీ బజార్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో సందర్శకులు తనకిష్టమైన వస్తువులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ సీఎం రాజేష్ మాట్లాడుతూ, క్లబ్‌ల అభివృద్ధికి సభ్యులతో కలిసి సమష్టిగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. సరస్వతి పథకం ద్వారా ప్రతి క్లబ్ నిర్వాహకులు గ్రామంలోని నిరుపేద పిల్లలను దత్తత తీసుకుని చదివించాలని పిలుపునిచ్చారు.

# దేవతామూర్తుల వేషధారణలో గిరి ప్రదక్షిణ

పెరంబూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రానికి చెందిన భక్తులు దేవతామూర్తుల వేషధారణలో పళని పర్వతాలయానికి తరలి వచ్చారు. కేరళ రాష్ట్రం ఒట్రపాళయం మణిచేరికి చెందిన వల్లువనాడు కృష్ణన్ కళానిలయానికి చెందిన మురుగన్ భక్తులు, దేవతామూర్తుల వేషధారణంలో దిండుగల్ జిల్లా పళని కొండ ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. వినాయకుడు, శివుడు, ఆంజనేయుడు, అయ్యప్ప, నంది బొమ్మపై శివుడు, నంది బొమ్మపై శివలింగం సహా పలు దేవతామూర్తుల వేషధారణలో పళని కొండ ఆలయానికి వచ్చి, గిరి ప్రదక్షిణ చేసిన స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వీరు గిరి ప్రదక్షిణ చేస్తున్న సమయంలో వందలాది మంది భక్తులు వారిని అనుసరిస్తూ 'హరోం హర' అంటూ దివ్యనామస్మరణ చేశారు. మరికొందరు భక్తులు దేవతామూర్తుల వేషధారణలో ఉన్న వారి ముందు నిలబడి సెల్ఫీలు తీసుకున్నారు.


వినాయకుడు, శివుడు, ఆంజనేయుడు, నరసింహస్వామి వేషధారణలో భక్తులు

## ది ఐ ఫౌండేషన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం, నల్లి కుప్పుసామి చెట్టి



చెన్నై, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరుకు చెందిన 'ది ఐ ఫౌండేషన్' ఆధ్వర్యంలో వడపళనిలో సూపర్‌స్పెషాలిటీ ఐ హాస్పిటల్ ఆదివారం ప్రారంభించారు.. ఈ కొత్త హాస్పిటల్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త 'నల్లి సిల్క్స్' అధినేత పద్మభూషన్ నల్లి కుప్పుసామి చెట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఆప్తమాలజికల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పార్థాబిశ్వాస్, ప్రముఖ కర్ణాటక సంగీత కళాకారిణి డా. నిత్యశ్రీ మహదేవన్. సంస్థ చైర్మన్ డాక్టర్ డి.రామమూర్తి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రేయా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామమూర్తి మాట్లాడుతూ వడపళనితో తమ సంస్థ 25వ శాఖ ఆసుపత్రి నిర్మించామని, 5 ఆపరేషన్ థియేటర్లు, 14 కన్సల్టింగ్ రూమ్‌లు, 24 ఆప్టోమెట్రీ లెన్స్, 7 ఇన్వెస్టిగేషన్ రూమ్‌లు, ఆప్తాల్మిక్ ల్యాబ్, డ్రగ్ స్టోర్, 10 ఎగ్జిక్యుటివ్ ఇన్ పేషంట్స్ రూమ్స్, 25 కమ్‌ఫర్టబుల్ డేకేర్ యూనిట్లు ఉన్నాయని వివరించారు.